

షాద్‌నగర్‌కు చెందిన మేఘనకు మెడిసిన్‌లో సీటు రాగా, ఆ కుటుంబానికి ఫీజు కట్టే స్థోమత లేదు. విషయం తెలిసిన కేటీఆర్‌తోపాటు ఎన్ఆర్ఐ పొట్టి శ్రీనివాస్ ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మంగళవారం నందినగర్‌లో ఎన్ఆర్ఐ తల్లితోపాటు కేటీఆర్ చెక్కును మేఘన కుటుంబసభ్యులకు అందజేశారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?

- విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నరు
- సమస్యలు గాలికొదిలి.. ముఖ్యమంత్రి ఢిల్లీ టూర్లా?
- గురుకుల భవనాల అద్దె కూడా చెల్లించరా?
- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే: కేటీఆర్

రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేడు. ముఖ్యమంత్రికి విద్యారంగ సమస్యలు తెలుసుకునే ఓపిక లేదు.. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేద, మధ్యతరగతి విద్యార్థులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చేదా? - కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ సర్కార్ భ్రష్టు పట్టిస్తున్నదని, ఓ వైపు ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరోవైపు ప్రైవేట్ విద్యను పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందకుండా పిల్లల జీవితాలతో రేవంత్‌రెడ్డి సర్కార్ చెలగాటమాడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించిన గురుకులాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించకుండా భద్రత పరంగా విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు. గురుకుల భవనాలకు కనీసం అద్దె కూడా చెల్లించకుండా తాళాలు వేసే దుస్థితి మునుపెన్నడూ రాలేదని వాపోయారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను చెల్లించకుండా విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేట్ కాలేజ్‌లకు ఫీజులు చెల్లించకపోవటమంటే పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువుకు దూరం చేయటమేనని స్పష్టంచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్‌లు నిరవధికంగా బంద్ చేయటం సిగ్గుచేటని విమర్శించారు. కాలేజీలు బంద్ పెడ్తామని యాజమాన్యాలు హెచ్చరించినా స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. బకాయిల కోసం యాజమాన్యాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం దుర్మార్గమని మండిపడ్డారు.

విద్యార్థులు నష్టపోకుండా చూడాల్సింది పోయి ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నడు. ఎప్పుడూ లేనివిధంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు నిరవధికంగా బంద్ ప్రకటించినా ముఖ్యమంత్రిలో చలనం లేదు. - కేటీఆర్

2వేల కోట్ల బకాయిలు చెల్లించినం

మూసీ సుందరీకరణ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్తున్న ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువు కోసం ఖర్చుపెట్టలేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడేనాటికి గత ప్రభుత్వాలు పెట్టిన రూ.2 వేల కోట్ల బకాయిలను విద్యార్థులకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థులపట్ల చిత్తశుద్ధి ఉంటే కాలేజీ యాజమాన్యాలతో చర్చలు జరిపి బకాయిలు చెల్లించి ఉండేదని చెప్పారు.

పోరాటం చేస్తం

రేవంత్‌రెడ్డి సర్కార్‌కు పరిపాలన అనుభవం లేదని, పేదల బాధలు తెలియవని, అందుకే విద్యార్థులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, విద్యార్థులకు నష్టం చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, రెండు మూడు రోజుల్లో పరిష్కారం చూపకుంటే విద్యార్థులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సర్కారు బాకీ.. కాలేజీలు బంద్

- ఈ విద్యాసంవత్సరం బకాయిలే 2,500 కోట్లు
- టోకెన్లిచ్చి పదినెలలైనా పైసా విదల్లని ప్రభుత్వం
- ఆర్థిక ఇబ్బందుల్లో కాలేజీల యాజమాన్యాలు
- రాష్ట్రవ్యాప్తంగా కళాశాల నిర్వాహకుల నిరసన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లించాలని రెండో రోజు కొనసాగిన నిరవధిక బంద్
- విద్యాసంస్థల మూతతో విద్యార్థుల్లో ఆందోళన

భువనగిరిలో ర్యాలీ తీస్తున్న ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలు, విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తేతెలంగాణ)/నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో సర్కారు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డిగ్రీ, పీజీ కళాశాలల నిర్వాహకులు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్ పాటించారు. రెండో రోజూ కాలేజీలు మూత పడడంతో వేలాది మంది విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. సిబ్బందికి వేతనాలు చెల్లించలేక, కళాశాల భవనాల అద్దెలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే డిమాండ్ చేయాలని నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా రెండో రోజూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ పాటించాయి. ఎంజీయూ పరిధిలో మొత్తం 76 కాలేజీలు నిరసనలో పాల్గొన్నాయి. తెలంగాణ అఫిలియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో ఆందోళన సాగిస్తున్నాయి. పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు సుమారు రూ.30కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు బోధన రుసుము బకాయిలు ఉన్నట్లు కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు తెలిపారు. భువనగిరిలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థులు ర్యాలీ తీసి, వినాయక చౌరస్తాలో నిరసన తెలిపారు.

జనగామ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీఎంఏ) ప్రతినిధులు, అధ్యాపకులు శాంతియుత నిరసన ర్యాలీ తీశారు. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీపీడీఎంఏ జనగామ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాలల నిర్వహణ ఇబ్బందిగా మారిందని, ఇప్పటికే తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని వాపోయారు. అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, విద్యుత్తు బిల్లులు, యూనివర్సిటీ రుసుములు చెల్లించలేకపోతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేక కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

టోకెన్లు ఇచ్చి పదినెలలు

అసెంబ్లీ ఎన్నికల ముందు యేటా క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని, అధికారంలోకి రాగానే పెండింగ్ బకాయిలు విడుదల చేస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్, ఆచరణలో విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. గత బకాయిలే కాకుండా ఈ ఏడాది చెల్లించాల్సిన రూ.2500 కోట్లను కూడా విడుదల చేయలేదు. అధికారంలోకొచ్చిన తొలినెలలోనే రూ.400 కోట్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీ చేసి కాలేజీల యాజమాన్యాలకు సమాచారమిచ్చింది. దాదాపు పదినెలలు గడుస్తున్నా విద్యార్థుల ఖాతాల్లో రీయింబర్స్‌మెంట్ జమ చేయలేదు. బీఆర్ఎస్ హయాంలో టోకెన్లు ఇచ్చిన మూడు, నాలుగు రోజుల్లోనే నిధులు విడుదలయ్యేవి. ఆ వెంటనే విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. కానీ కాంగ్రెస్ సర్కారు నిధుల విడుదలలో అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. లంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం పలుమార్లు ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పుడు యాజమాన్యాలు నిరవధిక బంద్ చేయడంతో విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంలో పడ్డాయి.

16.5 లక్షల మంది భవిష్యత్తు ప్రశ్నార్థకం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు వెయ్యి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు, మరో వెయ్యి దాకా వృత్తివిద్యా కాలేజీలు ఉన్నాయి. డిగ్రీ, పీజీ కాలేజీల్లో సుమారు 9.5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2 లక్షల మంది అధ్యాపకులు, నాన్‌టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. ఇంజినీరింగ్, ఫార్మా, బీఎడ్, డీఎడ్, ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్ తదితర వృత్తివిద్యా కాలేజీల్లో సుమారు 3.5 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. లక్షమంది దాకా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో డిగ్రీ, పీజీ కాలేజీలకు సుమారు రూ.800కోట్లు, ప్రొఫెషనల్ కోర్సుల కాలేజీలకు దాదాపు రూ.1700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉన్నది. పదినెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో కనీసం భవనాల అద్దె కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నామని కాలేజీల యజమానులు వాపోతున్నారు. మొత్తంగా 16లక్షల మంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఓయూ నుంచి పోరుబాట..

ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాల సంఘం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అనుసరించాల్సిన ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ప్రభుత్వం దిగివచ్చేదాకా కాలేజీలను బంద్ చేయాలని నిర్ణయించారు. ఈ వేదికనుంచే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. లక్షలాదిమంది విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేఖలో కోరారు.

దశలవారీగానైనా విడుదల చేయాలి

గత ప్రభుత్వం కొంత ఆలస్యమైనా టోకెన్లు జారీ చేసిన వెంటనే రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేది. ప్రస్తుత ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. రూ. 400 కోట్లకు టోకెన్లు ఇచ్చి పదినెలలు గడిచింది. నిధులు మాత్రం విడుదల చేయలేదు. అధ్యాపకులు, ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేక, బిల్డింగ్‌లకు రెంట్ కట్టలేక ఇబ్బంది పడుతున్నం. అప్పులు తెచ్చి కాలేజీలు నడుపుతున్నం. దిక్కుతోచని స్థితిలో కాలేజీలను బంద్‌చేయాలని నిర్ణయించినం. కనీసం ప్రభుత్వం ఒకేసారి కాకుండా దశల వారీగానైనా నిధులు విడుదల చేయాలి.

- సూర్యనారాయణరెడ్డి, టీడీపీఎంఏ ప్రెసిడెంట్

ఆశా కార్యకర్తలకు ఇంటిగ్రేటెడ్ రిజిస్టర్

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించేందుకు ఇంటిగ్రేటెడ్ రిజిస్టర్ విధానాన్ని ప్రారంభించినట్టు వైద్యారోగ్యశాఖ తెలిపింది. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ కలిసి మంగళవారం దీనిని ప్రారంభించినట్టు వెల్లడించింది. ఇప్పటివరకు ఆశా కార్యకర్తలు తమ విధి నిర్వహణలో భాగంగా సేకరించిన సమాచారాన్ని 17 వేర్వేరు రిజిస్టర్లలో నమోదు చేసేవారు. దీంతో వారికి పనిభారం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ క్రోడీకరించి కొత్తగా ఇంటిగ్రేటెడ్ రిజిస్టర్ పేరుతో ఒకే రిజిస్టర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ విధానంతో వారికి పనిభారం తగ్గడంతోపాటు ప్రజల ఆరోగ్య వివరాలన్నీ ఒకే చోట నమోదవుతాయని అధికారులు తెలిపారు.

విత్తనోత్పత్తిలో ఏపీ, తెలంగాణ పరస్పర సహకారం

హైదరాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): తెలంగాణ సీడ్స్ చైర్మన్ అన్వేష్ రెడ్డి మంగళవారం ఏపీ సీడ్స్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి, ఎండీ ఢిల్లీరావుతో విజయవాడలో సమావేశమయ్యారు. శనగ, మినుము, వేరుశనగ, వరి పంటల విత్తన లభ్యతతోపాటు ఉభయ రాష్ట్రాలకు అవసరమైన విత్తనోత్పత్తి, సరఫరా , పెండింగ్‌లో ఉన్న షేర్స్ డీమెర్జర్‌పై చర్చించారు. ఉద్యోగుల భవిష్య నిధి సమాచారం నెల రోజుల్లో తెలంగాణకు ఇచ్చేందుకు సుబ్బారెడ్డి, ఢిల్లీరావు అంగీకరించారు. సమావేశంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల విత్తనోత్పత్తి, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో రైతు మృతి

చిత్తూరు జిల్లా చిన్నగాండ్లపల్లిలో ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఏపీలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్య తీవ్రతరమైంది. పంట పొలాలను ధ్వంసం చేయడమే కాకుండా, రైతుల ప్రాణాలను బలి తీసుకుంటున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తున్నది. తాజాగా పీలేరు మండలం చిన్నగాండ్లపల్లి ఇందిరమ్మ కాలనీ సమీపంలో తిష్టవేసిన ఏనుగుల గుంపు మామిడి తోటకు కాపలాగా ఉన్న రైతు చిన్న రాజారెడ్డిపై దాడి చేశాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు ప్రజలకు సూచించారు.

5,191 కిలోమీటర్ల రైల్వేట్రాక్‌లు క్లీనింగ్

దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : స్వచ్ఛభారత్ మిషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే(ఎస్సీఆర్) ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛతా పఖ్వాడ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1 నుంచి 15 వరకు 'స్వభావ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత' కింద 5,191 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌లు శుభ్రం చేసినట్టు ఎస్సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. స్వచ్ఛతా పక్షోత్సవాల్లో భాగంగా పలు రైల్వేపరిధి భూముల్లో 73,536 మొక్కలు నాటినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులతోపాటు విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

డ్రగ్ రిహాబిలిటేషన్ కోసం ఏపీలో మద్యంపై 2% సెస్

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో మందుబాబులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. డ్రగ్ రిహాబిలిటేషన్ కోసం మద్యంపై 2% సెస్ విధించింది. మద్యం ల్యాండెడ్ రేట్లపై ఈ సెస్ విధించేలా చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా దాదాపు రూ.100 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. మరోవైపు మద్యం అమ్మకాల్లో చిల్లర సమస్య తలెత్తకుండా చూసేందుకు ప్రివిలేజ్ ఫీజు కింద ఎమ్మార్పీపై రూ.10 వరకు పెంచుకునేందుకు వీలుకల్పిస్తూ సవరణ చేసింది. సోమవారం లాటరీ విధానం ద్వారా మద్యం షాపులను కేటాయించిన ఏపీ ప్రభుత్వం.. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీని అమలు చేయనున్నది.

తాళాలకు తలవంచిన సర్కార్

- సాయంత్రం కల్లా గురుకుల భవనాలకు 2 నెలల అద్దె చెల్లింపు
- 10 నెలలుగా కిరాయి కట్టడం లేదని 500 భవనాలకు యజమానుల తాళాలు
- ఆరుబయటే నిరీక్షించిన టీచర్లు, విద్యార్థులు
- సర్కార్‌పై తల్లిదండ్రుల ఆగ్రహం
- దిగొచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- తాళాలు వేసినవారిపై క్రిమినల్ కేసులు పెట్టండి : కలెక్టర్లకు మంత్రి పొన్నం ఆదేశాలు

జయశంకర్ భూపాలపల్లిలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలకు తాళం వేయడంతో బయట వేచి ఉన్న ప్రిన్సిపాల్

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ)/ నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : పదినెలలుగా రాష్ట్రంలోని గురుకులాల ప్రైవేట్ భవనాలకు ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో గేట్లకు యజమానులు మంగళవారం తాళాలు వేశారు. దసరా సెలవులు ముగిసిన తర్వాత విద్యా సంస్థలు పునఃప్రారంభం కాగా బీసీ, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల భవనాలకు తాళాలు పడడంతో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆరు బయటే ఎండలో నిరీక్షించారు. గత్యంతరం లేదని భావించిన సర్కారు సాయంత్రంలోగా రెండు నెలల బకాయిలు విడుదల చేసింది. ఎస్సీ, మైనార్టీ గురుకులాలకు రెండు నెలలు, బీసీ మైనార్టీ గురుకులాలకు మూడు నెలల బకాయిలు చెల్లించింది. రాష్ట్రవ్యాప్తంగా 500 వరకు అద్దె భవనాల్లోనే బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి నెలకు రూ.2 లక్షల చొప్పున 10 నెలలకుగాను రూ.20 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యజమానుల సంఘం పిలుపుమేరకు మంగళవారం ఆయా భవనాలకు యజమానులు తాళాలు వేశారు. గురుకుల సొసైటీల కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించిన, ప్రిన్సిపాళ్లకు నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో భవనాలకు తాళాలు వేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచినట్టు పేర్కొన్నది. మిగతా బకాయిలు త్వరగా కట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కాగా విద్యా బోధనకు ఆటంకం కలిగించారన్న కారణంతో యజమానులపై కేసులు నమోదయ్యాయి.

గురుకులాల ఖ్యాతి పాతాళానికి : ఎర్రోళ్ల

కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరాన్ని తాకిన గురుకులాల ఖ్యాతి, కాంగ్రెస్ పాలనలో అధఃపాతాళానికి దిగజారిందని, ప్రభుత్వం అద్దె కట్టకపోవడంతో యాజమానులు గురుకులాలకు తాళాలు వేసే పరిస్థితి రావడం దారుణమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. 'గురుకులాల అద్దె చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తామనడం.. కన్నతల్లికి అన్నం పెట్టలేనోడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్త అన్నట్టుగా ఉన్నది' అని ఎద్దేవాచేశారు.

చదువులకు దూరం చేసే కుట్ర: బాలు

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేసీఆర్ గురుకులాలు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ సర్కారు వాటిని నిర్వీర్యం చేస్తున్నదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు ఓ ప్రకటనలో విమర్శించారు. కనీసం గురుకుల విద్యార్థులకు అన్నం పెట్టలేని దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీకి చక్కర్లు కొట్టేందుకు సమయం ఉంది కానీ, ముఖ్యమంత్రికి విద్యా వ్యవస్థ మీద ఒక్క సమీక్ష పెట్టే సమయం లేదా? అని ప్రశ్నించారు.

తప్పని పరిస్థితుల్లో వేయాల్సి వచ్చింది

పెండింగ్ కిరాయిలు చెల్లించాలని సెప్టెంబర్ 20న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సొసైటీల కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించినం. అయినా స్పందించకపోవడంతో 30న కార్యాచరణ ప్రకటించినం. ప్రిన్సిపాళ్లకు నోటీసులు ఇచ్చినం. అయినా పట్టించుకోకపోవడంతో గురుకుల బిల్డింగ్ గేట్లకు తాళాలు వేసి నిరసన తెలిపినం. కిరాయిలు సకాలంలో రాక ఈఎంఐలు కట్టకపోతే బ్యాంకు వారు భవనాలను జప్తు చేస్తామని బెదిరించడంతో తప్పని పరిస్థితుల్లో తాళాలు వేయాల్సి వచ్చింది. ప్రభుత్వం 2 నెలల కిరాయి విడుదల చేసింది.

- దేవేందర్‌రెడ్డి, గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

క్రిమినల్ కేసులు పెట్టండి: మంత్రి పొన్నం

అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలల గేట్లకు తాళాలు వేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లాల కలెక్టర్లకు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. గురుకుల ప్రిన్సిపాళ్లను యజమానులు ఇబ్బందులు పెడితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయంగా అక్కడి నుంచి ఖాళీ చేసి వేరే భవనాలు చూడాలని సూచించారు. నేడో రేపో నిధులు విడుదల చేస్తామని చెప్పారు. గురుకుల స్కూళ్ల గేట్లకు పెట్టిన బ్యానర్లు వెంటనే తొలగించాలని, విద్యార్థులకు సక్రమంగా తరగతులు నడిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేదంటే ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పాత బకాయిలు ఇప్పించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు.

గురుకులాలను మూసేసే కుట్ర : కేటీఆర్

'ఢిల్లీకి పంపేందుకు డబ్బుల మూటలున్నయ్.. గురుకుల భవనాల అద్దెలు చెల్లించేందుకు పైసల్లేవా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఎక్స్‌వేదికగా ప్రశ్నలు సంధించారు. 'కమీషన్లు వచ్చే బడా కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు వేలకోట్లున్నయ్ కానీ పేద విద్యార్థులు చదువుకొనే గురుకుల పాఠశాలల అద్దెలు చెల్లించేందుకు పైసల్లేవా? సిగ్గు, సిగ్గు.. ఇది గురుకులాలను శాశ్వతంగా మూసేసే కుట్ర లాగా కనబడుతున్నది' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఇంకెప్పుడు అద్దె చెల్లిస్తరు?: హరీశ్‌రావు

పెండింగ్‌లో ఉన్న గురుకుల భవనాల కిరాయిలను తక్షణమే చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 'ముఖ్యమంత్రీ.. గురుకులాల అద్దె ఇంకెప్పుడు చెల్లిస్తరు?' అని ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. 'రాష్ట్ర ప్రభుత్వం 10 నెలలుగా అద్దె చెల్లించక స్కూల్ గేట్లకు తాళం వేసిన దుస్థితి. కాంగ్రెస్ పాలనలో గురుకులాల నిర్వహణ అధ్వానంగా మారిందనేందుకు ఇదే నిదర్శనం.రోజురోజుకూ దిగజారుతున్న విద్యావ్యవస్థ గురించి విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న మీరు ఇంకెప్పుడు పట్టించుకుంటరు?' అని నిలదీశారు.

టీచర్ల కౌన్సెలింగ్‌లో గందరగోళం

ఉదయం వాయిదా.. మధ్యాహ్నం కొనసాగింపు

- ఆందోళనలో డీఎస్సీ-2024 అభ్యర్థులు
- మిగిలిన వారికి నేడు పోస్టింగ్స్
- అక్రమాలు జరిగాయని ఆదిలాబాద్‌లో నిరసన
- డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయింపు
- కుమ్రం భీం జిల్లాలో చీకట్లోనే కౌన్సెలింగ్
- సెల్‌ఫోన్ లైట్ల మధ్య ధ్రువపత్రాల పరిశీలన

ఆదిలాబాద్‌లో డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులను బయటకు తీసుకెళ్తున్న పోలీసులు

హైదరాబాద్/ ఆదిలాబాద్, అక్టోబర్ 15 (నమస్తేతెలంగాణ)/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్: డీఎస్సీ-2024లో భాగంగా కొత్త టీచర్ల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొన్నది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇవ్వాలి. బుధవారం విధుల్లో రిపోర్ట్ చేయాలి. కానీ నేడు ఉదయం కొన్ని జిల్లాల్లో సెలెక్షన్ లిస్ట్‌లు రాకపోవడం, సాంకేతిక సమస్యలతో వాయిదావేస్తున్నట్టు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు అభ్యర్థులకు సమాచారం అందించారు. అయితే కొన్ని గంటల తర్వాత సెలెక్షన్ లిస్ట్‌లు రావడం, సాంకేతిక సమస్యలు పరిష్కరించడంతో కౌన్సెలింగ్ యథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే అప్పటికే కౌన్సెలింగ్ సెంటర్లనుంచి వెనుదిరిగిన అభ్యర్థులు, తిరిగి పరుగుపరుగునా సెంటర్లకు చేరుకున్నారు.

వాయిదాకు కారణం 317జీవోనే..

మంగళవారం ఉదయం టీచర్ల కౌన్సెలింగ్ వాయిదాకు సాంకేతిక సమస్యలే కారణమని అధికారులు చెప్పినప్పటికీ.. అసలు కారణం 317 జీవోనే అని విశ్వసనీయంగా తెలిసింది. ఈ జీవో ద్వారా ప